క్లుప్తంగా

అంకమ్మ అమ్మవారికి పూజలు



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్లలో భాగంగా నాలుగోరోజు శుక్రవారం గ్రామస్తులు అమ్మవారికి బోనాలతోపాటు అంకమ్మ క్రతువులు ఘనంగా నిర్వహించారు. ఆచారం ప్రకారం బైండ్లవారు పూలకప్పెర పట్టుకొని గ్రామంలో అమ్మవారి చరిత్రను ఒగ్గుకథ రూపంలో చెప్పారు. అర్ధరాత్రి తరువాత అంకమ్మ వారి ఆలయంలో దీవెన బండారు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. అంకమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన జలబిందెల్లోని నీటిని నవధాన్యాలపై చల్లారు. శనివారం జరిగే పూర్ణాహుతి కార్యక్రమంతో పెద్ద తిరునాళ్ల ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కంచికచర్ల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కృష్ణారావు తెలిపారు. మండల కేంద్రం కంచికచర్ల, గొట్టుముక్కల, పేరకలపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అన్నదానానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్, న్యూనాగోల్ ప్రాంతానికి చెందిన ఎం. కృష్ణదీపు రూ.15,116లను శుక్రవారం ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. నిత్యాన్నదాన పథకానికి మండలంలోని కొణకంచి గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వరరావు రూ.11,011, అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి రూ.11,011గా విరాళంగా అందజేశారు, ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

రోలర్ స్కేటర్ సోనీచౌరాసియాకు అభినందన

ఇబ్రహీంపట్నం: గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత, రోలర్ స్కేటర్ సోనీ చౌరాసియా కాశీ నుంచి కాశీకి రోలర్ స్కేటింగ్ చేస్తూ శుక్రవారం ఇబ్రహీంపట్నం చేరుకున్నారు. స్థానిక రింగ్ సెంటర్‌లో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు మారాసు కృష్ణమోహన్, నియోజకవర్గ ఆర్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి సూరినీడి వెంకట సూరజ్ ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈయాత్రను విజయవంతంగా పూర్తిచేయాలని ఆకాంక్షించారు. జనవరి 20న కాశీలో ప్రారంభమైన రోలర్‌స్కేటింగ్ యాత్ర మే నెల ఆఖరున తిరిగి కాశీకి చేరుకుంటుందని సోనీ చౌరాసియా తెలిపారు.

వసతుల్లేక ఇబ్బందుల్లో దివ్యాంగులు



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో దివ్యాంగుల సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ కోసం ఏర్పాటు చేసిన సదరన్ కేంద్రంలో సరైన వసతులు లేక దివ్యాంగులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుకు 60 మంది చొప్పున దివ్యాంగులను పరిశీలించి వారికి ఎంతశాతం అంగవైకల్యం ఉన్నదో నిర్ధారించి సర్టిఫికెట్లను జారీచేసేందుకు గురువారం నుంచి శనివారం వరకు మూడురోజులపాటు క్యాంపు నిర్వహిస్తున్నారు. అయితే శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకల్లా దివ్యాంగులు ఆస్పత్రికి చేరుకోవాలని సూచించిన వైద్యులు, పదిగంటలు దాటిన తర్వాత రావడంతో దివ్యాంగులు ఇబ్బందిపడ్డారు. కేవలం టెంట్ మాత్రమే వేశారని, మంచినీరు మినహా ఇతర ఏర్పాట్లు చేయలేదని దివ్యాంగులు తెలిపారు. తాము మెట్లు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేశారు.

క్యాంపునకు హాజరయ్యేవారు ఏఏ ధ్రువీకరణ పత్రాలు వెంట తెచ్చుకోవాలో చెప్పేందుకు కూడా ఇక్కడ సిబ్బంది ఎవ్వరూ లేరని దివ్యాంగులు ప్రసాద్, కనకలక్ష్మి వాపోయారు. దివ్యాంగుల ఇబ్బందిని గమనించిన స్థానిక పాత్రికేయులు వారికి అల్పాహారం ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ప్రభుత్వాస్పత్రిలోని సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ క్యాంపును పరిశీలించారు. ఎమ్మెల్యేకు దివ్యాంగులు తమ ఇబ్బందులను ఏకరువుపెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శనివారం క్యాంపునకు వచ్చేవారికిఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

జోరుగా అక్రమ లేఅవుట్లు

- అనుమతులు నిల్
- ఇష్టారాజ్యంగా వెంచర్లు
- చోద్యం చూస్తున్న అధికారులు



నిబంధనలు పాటించకుండా చిల్లకల్లులో హైవే పక్కన వేసిన వెంచర్

జగ్గయ్యపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో పలువురు రియాల్టర్లు అనుమతులు తీసుకోకుండానే వెంచర్లు ఏర్పాటు చేస్తుండటం వివాదాలకు దారితీస్తోంది. కొందరు రియాల్టర్లు వ్యవసాయ భూమిలో ఇష్టారీతిన ప్లాట్లు వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ప్రజలకు టోకరా వేస్తున్నారు.

ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే..

వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చాలంటే రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యవసాయభూమిని వ్యవసాయేతర అవసరాల నిమిత్తం వినియోగించుకునేందుకు ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలి. అందుకు ప్రభుత్వానికి భూమి విలువలో 2శాతం వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా సీఆర్డీఏ పరిధిలో ఉన్న భూమి అయితే ఆవిభాగంతోపాటు స్థానిక పంచాయతీ అనుమతి కూడా తప్పనిసరి. కాని రియాల్టర్లు ఇవేమి పట్టించుకోకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు..

మండలంలోని చిల్లకల్లులోని 65వ నంబరు జాతీయ రహదారి పక్కన, వేదాద్రి రోడ్డు, తిరుమలగిరి, గౌరవరం, షేర్‌మహ్మద్‌పేట, ముక్త్యాల తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. లేఅవుట్ ప్లాన్ అనుమతులు తీసుకోకుండానే వ్యవసాయ భూములను ప్లాట్లుగా విభజించి వెంచర్లు వేశారు. ఒక్కో ప్లాటును మూడు నుంచి ఐదు సెంట్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. మధ్యతరగతి ప్రజల సొంతింటి ఆకాంక్షలను ఆసరా చేసుకుని, ఎటువంటి అనుమతులు లేని ఈప్లాట్లను సెంటు రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు విక్రయిస్తుండటం గమనార్హం. అనుమతులు తీసుకోకపోవడంతోపాటు సామాజిక అవసరాల నిమిత్తం వెంచర్ విస్తీర్ణంలో పదిశాతం భూమిని కేటాయిస్తూ ఆభూమిని స్థానికసంస్థలకు అప్పగించాల్సి ఉంటుంది. ఈ వెంచర్లలో అటువంటి నిబంధనలేవి పాటించలేదు. ఇటువంటి అనుమతుల్లేని, నిబంధనలు పాటించని వెంచర్లలో భూమిని కొనుగోలు వ్యవహారం భవిష్యత్‌లో ఇబ్బందికరంగా మారుతుందని చెప్పవచ్చు.

చెరువు భూమి సైతం విక్రయం..

ఇటీవల జగ్గయ్యపేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేట-రామచంద్రునిపేట రహదారిలో ఉన్న ఎన్‌ఎస్పీ, పంట కాల్వల స్థలాలను ఆక్రమించి లేవుట్ వేసి ప్లాట్లను విక్రయాలు జరిపారు. తీరా ఓ కొనుగోలుదారుకు అసలు విషయం తెలిసి నిలదీయడంతో వారు నగదును తిరిగి ఇచ్చినట్లు సమాచారం. ఇలా 'కాదేదీ కబ్జాకు అనర్హం' అన్నట్లుగా పలువురు రియాల్టర్లు ప్రభుత్వ భూమిని సైతం ప్లాట్లుగా మార్చి జేబులు నింపుకుంటున్నారు. ఈ అక్రమ లేవుట్లపై కొరడా ఝళిపించాల్సిన రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు మాత్రం చోద్యం చూస్తుండటంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. ఇకనైనా ఆయా శాఖల అధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లు తొలగించడంతోపాటు వాటిని ఏర్పాటు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేకుంటే చర్యలు...

గ్రామాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేయాలంటే సీఆర్డీఏ, రెవెన్యూశాఖలతోపాటు ఆయా పంచాయతీల అనుమతి కూడా తప్పనిసరిగా ఉండాలి. ఇష్టానుసారంగా లేఅవుట్లు ప్లాట్లను ప్రజలకు అంటగట్టే వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. ఇటీవల కలెక్టర్, సీఆర్డీఏ అధికారుల సమీక్ష సమావేశాల్లోనూ ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. గ్రామాల్లో అక్రమ లేఅవుట్లను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

–నితిన్, ఎంపీడీవో



షేర్‌మహ్మద్‌పేటలో వేసిన అక్రమ లేఅవుట్



చిల్లకల్లు-వేదాద్రి రోడ్డులో అనధికార వెంచర్

సాక్షి కథనాలకు స్పందన

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

నందిగామటౌన్(నందిగామరూరల్): తాగునీటి పైపులైన్ లీకేజీకి గురై నీరంతా వృథాగా పోతున్న వైనంపై 'తాగునీటి పైపులైన్ లీకేజీ' శీర్షికన 'సాక్షి' దినపత్రిక శుక్రవారం ప్రచురించిన కథనానికి మున్సిపల్ సిబ్బంది స్పందించారు. స్థానిక పాతబస్టాండ్ నుంచి అనాసాగరం వెళ్లే రోడ్డులో వజినేపల్లి గార్డెన్ ఎదురుగా తాగునీటి పైపులైన్ లీకేజీకి గురై 15రోజులుగా నీరంతా వృథాగాపోతోంది. ఈ విషయంపై 'సాక్షి' ప్రచురించిన కథనానికి మున్సిపల్ సిబ్బంది స్పందించి మరమ్మతులు చేపట్టి లీకేజీని అరికట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి' దినపత్రికకు కృతజ్ఞతలు తెలియజేశారు.



తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

నందిగామరూరల్:మండలంలోని దాములూరు కూడలి గ్రామానికి వెళ్లే రహదారులకు అధికారులు శుక్రవారం నుంచి మరమ్మతులు ప్రారంభించారు. మహాశివరాత్రి మహోత్సవాల నేపథ్యంలో సంగమేశ్వరస్వామి ఆలయానికి శివరాత్రి రోజున వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉండగా దాములూరు కూడలి రోడ్లు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. ఈ విషయంపై 'సాక్షి' దినపత్రిక ఈనెల 13వతేదీన 'అధ్వానంగా దాములూరు కూడలి రోడ్లు' శీర్షికన ప్రచురించింది. ఈ కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఆయా రోడ్ల మరమ్మతులు చేపట్టారు. రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టడంపై భక్తులు హర్షం వ్యక్తంచేస్తూ అందుకు కృషిచేసిన 'సాక్షి' దినపత్రికకు కృతజ్ఞతలు తెలియజేశారు.



దాములూరులో కొనసాగుతున్న రోడ్డు మరమ్మతు పనులు

ప్రత్యేక కార్యాచరణతో అభివృద్ధి ప్రణాళికలు

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



టెన్త్ విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ



చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, పక్కన పీడీ రాము, తహసీల్దార్ శాంతిలక్ష్మి

పెనుగంచిప్రోలు: ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం(ఏబీపీ)కింద పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో ప్రత్యేక కార్యాచరణతో అభివృద్ధి ప్రణాళికలు అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. పెనుగంచిప్రోలులో శుక్రవారం ఆయన పర్యటించారు. క్షేత్రస్థాయిలో వివిధ సూచికల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. చిన్నారులతో ముచ్చటించి వారి చేత నంబర్లు, రైమ్స్ చెప్పించారు. చిన్నారుల శారీరక, మానసిక ఆరోగ్య వికాసానికి అందుబాటులో ఉన్న వసతులు, అవసరమైన సౌకర్యాలను అధికారులను అడిగితెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య రంగంలో సూచికల్లో ప్రగతికి సంబంధించి ఆరోగ్య కార్యకర్తలు చేపట్టిన ఎన్‌సీడీ సర్వేను తీరును పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన ఈసర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించకుంటే మంచి ఫలితాలు ఉంటాయని సూచించారు.

ప్రత్యేక అవసరాలున్న పిల్లలపై దృష్టి...

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు మంచి భవిష్యత్ అందించాలనే లక్ష్యంతో ఆకాంక్షిత బ్లాక్‌ల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఇందులోభాగంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో రెండు రోజులపాటు సహిత విద్యా శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించడం, బ్రెయిలీ లిపి, విద్యాహక్కు చట్టం-11సూచికలు తదితర అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు.

అనంతరం కలెక్టర్ స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయుల బోధనాతీరును ఆరాతీశారు. ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడిన విద్యార్థినులు శ్రీజ, ఇందులను అభినందించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి. మహేశ్వరరావు, డ్వామా పీడీ ఎ.రాము, ఏబీపీ బ్లాక్ కోఆర్డినేటర్లు మోహన్ సందీప్, పి.శ్రీనివాస్, తహసీల్దార్ ఎ. శాంతిలక్ష్మి, ఎంపీడీఓ జి.శ్రీను, ఎంఈఓ డి.రవీంద్ర, వైద్యాధికారి సృజన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువు తయారీపై అవగాహన



ప్రశంసాపత్రం అందజేస్తున్న కమిషనర్ రమణబాబు

నందిగామ టౌన్(నందిగామ రూరల్): తడి,పొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువుగా తయారు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ రమణబాబు సూచించారు. స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా తడి,పొడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా ఇళ్ల వద్దకు వచ్చే చెత్త సేకరణ సిబ్బందికి అందించాలన్నారు. తద్వారా పరిశుభ్రమైన నందిగామకు ప్రజలకు సహకరించాలన్నారు. పట్టణంలోని 3, 14వ వార్డులకు చెందిన సరిత, రాధిక తడిపొడి చెత్తను వేరు చేసి పొగాకు కాడలను నీటిలో నానబెట్టి సేంద్రియ ఎరువుగా వినియోగిస్తూ మొక్కలు పెంచడాన్ని కమిషనర్ పరిశీలించారు. వారిని అభినందిస్తూ ప్రశంసాపత్రం అందజేశారు. అనంతరం రైతుబజార్ వద్దనున్న అన్నా క్యాంటీన్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రామన్నపేట రోడ్డులో మురుగునీరు పారుదలకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ ఫణి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

చందర్లపాడు(నందిగామరూరల్): విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకట్రావమ్మ సూచించారు. మండలంలోని ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ అభి పడాయిబీ కార్యక్రమంపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ముఖ్యంగా ఆరోగ్యం, బరువు తక్కువ ఉన్నవారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో షేక్ ఇశ్రాత్, శ్రీదేవి, శ్రీలత పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



జాతీయ రహదారిని పరిశీలిస్తున్న నందిగామ రవాణాశాఖాధికారి పద్మావతి, అధికారులు

నందిగామరూరల్: జాతీయ రహదారిపై ప్రమాదాల చోటుచేసుకునే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని నందిగామ రవాణాశాఖాధికారి పద్మావతి తెలిపారు. ఆర్‌అండ్‌బీ, ట్రాఫిక్, జాతీయ రహదారుల అధికారులతో కలిసి శుక్రవారం ఆమె పట్టణంలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ భద్రతా మాసోత్సవాలలో భాగంగా జాతీయ రహదారిని పరిశీలించినట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో సూచిక బోర్డులతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐ పూర్ణిమ, ఆర్‌అండ్‌బీ ఏఈ కిశోర్, ట్రాఫిక్ ఎస్‌ఐ నరేష్, జాతీయ రహదారుల అధికారులు పాల్గొన్నారు.

చిట్టూరి భార్గవ్‌కు నేతల నివాళి



చిట్టూరి భార్గవ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు



భార్గవ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: గతనెల 31న ఐర్లాండ్‌లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చిట్టూరి భార్గవ్ మృతదేహం శుక్రవారం తెల్లవారుజామున జగ్గయ్యపేటకు చేరింది. పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉంటున్న భార్గవ్ తండ్రి సాయిబాబా నివాసం వద్ద మృతదేహాన్ని పట్టణ ప్రముఖులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. సాయిబాబాను పరామర్శించి, ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుడు భార్గవ్‌కు నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు వట్టెం మనోహర్, రామిని ఉపేందర్‌రెడ్డి, చౌడవరపు జగదీష్, బలుసుపాడు సర్పంచ్ యడ్లపల్లి సూరిబాబు తదితరులు ఉన్నారు.

చైర్‌పర్సన్ కృష్ణకుమారికి సత్కారం

నందిగామ టౌన్(నందిగామ రూరల్): ఆర్యవైశ్యులకు అన్ని రకాలుగా అండగా ఉండటంతోపాటు వారి అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తెలిపారు. నూతనంగా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన కృష్ణకుమారిని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు తమ వంతు సహకారం అందించటంతోపాటు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పారేపల్లి సాయిబాబు, మారం అమరయ్య, మహంకాళి కోటి, పబ్బతి జనార్దనరావు, సముద్రాల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



శిక్షణ తరగతులకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు



ముండ్లపాడులో శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్లు ఉషారాణి, సువర్ణ

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా చిల్లకల్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.శారద మాట్లాడుతూ తీవ్రమైన పోషణాలోపం ఉన్నవారిని గుర్తించే విధానం, వారికి అందించాల్సిన పోషకాహారం, తీసుకోవాల్సిన శ్రద్ధపై అవగాహన కల్పించారు. తల్లిపాలతో కలిగే ప్రయోజనాలు, చిన్నారులకు వెయ్యిరోజుల సంరక్షణ, ఆహార ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం తదితర అంశాలను వివరించారు. గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త ప్రభావతి మాట్లాడుతూ సంపూర్ణ పోషకాహారం, చిరు ధాన్యాల ప్రాముఖ్యతను అంగన్‌వాడీ కార్యకర్తలకు వివరించారు. టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ మాధురి, సీడీపీవో లక్ష్మీభార్గవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదం చేస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉషారాణి, సువర్ణ అన్నారు. పోషణ్ బి పడాయి కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం శిక్షణనిచ్చారు. పిల్లలకు పోషణ, పూర్వ ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

వత్సవాయిలో...

అంగన్‌వాడీ కేంద్రాలను పోషకాహార కేంద్రాలుగా మాత్రమే కాకుండా నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందించే కేంద్రాలుగా మార్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని సామాజికవేత్త కర్లపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీబీ జాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రిటిష్ పాలకులే నయమనిపిస్తోంది

మైలవరం ఠాణా ఎదుట దళితుల ధర్నా

మైలవరం: దళితుడైన సంసోనుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. నేటికీ దళితులకు స్వాతంత్ర్య ఫలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి బ్రిటిష్ పాలకులే నయమనిపిస్తోందన్నారు. మైలవరం మండలం ములకలపెంట గ్రామంలో ఈ నెల 8వ తేదీన జరిగిన హత్య కేసులో అనుమానితులుగా ఉన్న చల్లా సుబ్బారావు, సగ్గుర్తి సంసోనులను పోలీసులు మైలవరం సీఐ కార్యాలయానికి తీసుకువచ్చారు. సుబ్బారావుపై చేయి వేయని పోలీసులు దళితుడైన సంసోనుపై మాత్రం థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. సీఐ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు ఆందోళన చేపట్టారు. సీఐకు వినతిపత్రం అందజేసే వరకు కదిలే ప్రసక్తి లేదని గ్రామస్తులు భీష్మించారు. ఎస్ఐ సుధాకర్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు అంగీకరించలేదు.

గోల్డ్ ఫైనాన్స్ కంపెనీల్లో తనిఖీలు

రూ. 1.60 కోట్ల విలువైన బంగారం రికవరీ కోసమేనా..!

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గోల్డ్ ఫైనాన్స్ కంపెనీల్లో మచిలీపట్నం పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. చిట్టినగర్ మసీదు ఎదురుగా ఉన్న గోల్డ్ కంపెనీతోపాటు బంగారయ్య కొట్టు సమీపంలోని మరో గోల్డ్ ఫైనాన్స్ కంపెనీలో కూడా తనిఖీలు జరిగాయి. కృష్ణాజిల్లా మచిలీపట్నంకు చెందిన ఓ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ బ్యాంక్‌లో ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని మాయం చేశాడు. సుమారు రూ. 1.60 కోట్ల విలువైన బంగారాన్ని మాయం చేసిన ఈ ఘటనలో అసిస్టెంట్ మేనేజర్‌కు బ్యాంక్ మేనేజర్ సహకారం అందించినట్లు తెలుస్తోంది. ఆ బంగారాన్ని చిట్టినగర్‌లోని గోల్డ్ ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టారనే అనుమానంతో పోలీసులు ఆయా గోల్డ్ ఫైనాన్స్ కంపెనీల రికార్డులను తనిఖీ చేశారు. ఫైనాన్స్ కంపెనీ కార్యాలయాల్లోకి బయటవ్యక్తులు ఎవరూ రాకుండా పోలీసు సిబ్బంది కట్టుదిట్టంగా వ్యవహరించారు. ఫైనాన్స్ కంపెనీలో ఉన్న రికార్డుల మేరకు బంగారాన్ని ఎవరెవరి పేరిట తాకట్టు పెట్టారు.. ఈ కేసులో ఇంకా ఎవరైనా నిందితులు ఉన్నారా అనే కోణంలో విచారణ జరుగుతోంది. మరోవైపు ఈ బంగారాన్ని కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోల్డ్ ఫైనాన్స్‌లు తాకట్టు పెట్టుకోవడంలో స్థానికంగా ఎవరైనా నిందితులు సహకరించారా అనే దిశగా కొత్తపేట పోలీసులు విచారణ చేపట్టారు.